# అభివృద్ధి పథంలో అంకుసాపూర్

- ఎటుచూసినా సీసీ రోడ్లు
- శుభ్రంగా డ్రైనేజీలు
- ఆహ్లాదకరంగా పల్లె ప్రకృతి వనం

ఆసిఫాబాద్ టౌన్, జూలై 9 : మండలంలోని అంకుసాపూర్ గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. ప్రభుత్వ పథకాలను టసద్వినియోగం చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నది. గ్రామంలో మొత్తం 612 కుటుంబాలు ఉండగా 2551 జనాభా నివసిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సుమలత ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ అభివృద్ధికి తన వంతూ కృషి చేస్తుంది. గ్రామంలో 182 మంది ఆసరా పింఛన్లు అందుకుంటున్నారు. అలాగే గొల్లకుర్మలకు 30 యూనిట్ల (630) గొర్రెలను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా 58 మంది లబ్ధిపొందారు.అంతేగాకుండా 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలో రూ. 33 లక్షలతో 110 మీటర్ల అంతర్గత సీసీ రోడ్లు, 20 మీటర్ల డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో గ్రామం రూపు రేఖలు మారిపోయాయి.

### ఆహ్లాదకరంగా పల్లె ప్రకృతి వనం

గ్రామంలోని పల్లె ప్రకృతి వనం ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. మందారం, గన్నేరు, స్వస్తికం ఇలా పలు రకాల జామ, అల్లనేరేడు, అంజీర్ లాంటి పండ్ల మొక్కలతోపాటు గోరింట తదితర మొక్కల పెంపకంతో వనం పచ్చదనంతో ఆకట్టుకుంటుంది. పిల్లలు, పెద్దలు వనంలో ఏర్పాటు చేసిన బెంచీలలో కూర్చొని సేదతీరుతున్నారు.



ఎస్సీ కాలనీలో నిర్మించిన డ్రైనేజీ



తెలిగూడలో నిర్మించిన సీసీ రోడ్డు




పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లు

### రోడ్లు మంచిగున్నయ్..



మా గ్రామంలో ఇప్పుడు రోడ్లు మంచిగున్నయ్. ఇంత కు ముందు మట్టి రోడ్లు ఉండేవి. దీంతో వర్షాకాలంలో బురదమయంగా మారేది. నడిచేందు కు కూడా ఇబ్బందులు పడేవాళ్లం. ఇ ప్పుడు గ్రామంలో ఎటుచూసినా సీసీ రో డ్లు వేశారు. ఏ కాలమైనా సాఫీగా వెళ్తున్నాం.

-కవల్కర్ నాందేవ్, అంకుసాపూర్

### స్వరాష్ట్రంలోనే అభివృద్ధి..



తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే మా గ్రామంలో అభివృద్ధి జరిగింది. అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో పట్టించుకోకపోవడంతో కనీస సౌకర్యాలు చాలా ఇబ్బందులు పడ్డాం. కానీ ఇప్పుడు మా గ్రామ రూపురేఖలో మారిపోయాయి.

-తిరుపతి గొల్లవాడ, అంకుసాపూర్

### గ్రామస్తుల సహకారంతోనే..



గ్రామస్తులు, సర్పంచ్ సహకారంతో గ్రామంలో అభివృద్ధి చేపట్టాం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. 'మనఊరు-మనబడి'లో భాగంగా పాఠశాలకు మరమ్మతులు చేయించి, రంగులు వేయడంతో పిల్లలు సం తోషంగా బడికి వస్తున్నారు. గ్రామస్తు లు కూడా సహకారం అందిస్తున్నారు.

-సుమలత పంచాయతీ కార్యదర్శి, అంకుసాపూర్

## T9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 9 : T9 టికెట్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి రూ.100తో టికెట్ తీసుకున్న వారికి పల్లె వెలుగు బస్సుల్లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణ ంచేయవచ్చున్నారు. ఇప్పటివరకు ఉన్న ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ప్రయాణ సమయం ఉండేదని, అయితే ప్రయాణికుల అభ్యర్థన మేరకు 3 గంటల పాటు పెంచి రాత్రి 9 గంటల వరకు మార్చమని పేర్కొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

ఆసిఫాబాద్ టౌన్, జూలై 9 : జిల్లాకేంద్రంలో ఆదివారం పోచమ్మ బోనాల సందడి నెలకొన్నది. ఆషాఢమాసం ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకోని రాజంపేట్ కాలనీవాసులు బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో వెళ్తున్న రాజంపేట్‌కాలనీ వాసులు

## మొక్కలను సంరక్షించాలి

వాంకిడి, జూలై 9 : హరిరిహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని చౌపన్ గూడ సర్పంచ్ సిడాం అన్నీగా అన్నారు. పంచాయతీలో పరిధిలోని సడక్‌గూడ గ్రామంలో రోడ్లకిరువైపులా మొక్కలకు ఆదివారం నీళ్లుపోశారు.



వాంకిడి : ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్లు పడుతున్న సర్పంచ్ సిడాం అన్నీగా

## కిరాణా షాపు దగ్ధం

కెరమెరి, జూలై 9: బోలాపటార్ గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాడే నాణేశ్వర్‌కు చెందిన దుకాణం రాత్రి మూసేసి ఇంటికెళ్లాడు. ఉదయం తెరిచి చూసేసరికి సరుకులు, సామగ్రి మొత్తం కాలిపోయింది. విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని, ఫ్రీజ్ ఇతర సామగ్రి, సరుకులు కాలిపోయాయని తెలిపారు. సుమారు రూ. లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.




## ప్రగతిబాటలో 'బంబార'

ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోని బంబార గ్రామం స్వరాష్ట్రంలో ప్రగతి పథంలో దూసుకుపోతున్నది. తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేయగా, వీధివీధినా సీసీ రోడ్లు, వైకుంఠధామం, డంప్‌యార్డు, నర్సరీ నిర్వహన, పారిశుధ్య పనులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నది. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు సైతం అందుకున్నది.

-వాంకిడి, జూలై 9

## మహంకాళీ ఆలయంలో పూజలు

రెబ్బెన, జూలై 9: మండలంలోని ఇందిరానగర్ మహంకాళీ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ బోనాలు, పట్టువస్త్రాలు, నైవేద్యాలు, ఒడి బియ్యం, మేకలు, కోళ్లు తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నాగ సాధువులు కూడా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు